క్లుప్తంగా

అర్హులైన కౌలు రైతులకు సాగు హక్కుపత్రం

పెదపూడి: అర్హులైన కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. పెదపూడిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రం ద్వారా వాస్తవ సాగుదారునికి ఈ–పంట నమోదు, పంట నష్ట పరిహారం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ, కనీస మద్దతు ధర, ధాన్యం కొనుగోలు వంటి పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. మండలంలో 10 వేల కార్డులు జారీ లక్ష్యం కాగా ప్రస్తుతానికి 1000 కార్డులు జారీ చేశామన్నారు. ఈ ప్రక్రియ మరో నెల పాటు కొనసాగుతుందని, అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులతో కథలు చదివిస్తున్న లైబ్రేరియన్ అరుణ్‌కుమార్

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో 30వ రోజు వేసవి శిక్షణ శిబిరం లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు సతీష్‌బాబు, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు సరస్వతీ నమస్తుభ్యం గేయం, వందేమాతరం గీతం ఆలపించారు. గాలిమేడలు అనే బాలల కథను హాజరైన విద్యార్థులతో చదివించి, ప్రశ్నలు వేసి జవాబులు చెప్పించారు. పుస్తక సమీక్ష, వినోదం, చిత్రలేఖనం, ఇంగ్లిష్, తెలుగు వ్యాకరణల వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం జేష్ఠ మాసం తదియ పురస్కరించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

గోకవరం: స్థానిక విశాల సహకార పరపతి సంఘంలో రైతులకు ఖరీఫ్‌లో సాగుకు అవసరమయ్యే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంఘం చైర్మన్ గాజింగం సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1061, 1064, పీఎల్‌ఏ, బీపీటీ సాంబ రకం వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 1061, 1064, పీఎల్‌ఏ రకం విత్తనాలు 30 కేజీలు రూ.1100, బీపీటీ సాంబ రూ.930 అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంఘంలో సంప్రదించాలన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలి



రంగంపేట పీహెచ్‌సీలో ఆశాల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

రంగంపేట: మండలంలోని ప్రతి గ్రామంలో ఐదేళ్లలోపు చిన్నారులపై ఆయా స్థానిక వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డి.లావణ్య సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశాలకు మంగళవారం ఆమె ఐడీఎఫ్‌సీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 17వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఐదేళ్లలోపు చిన్నారులు విరోచనాల బారినపడితే అటువంటి వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయమణి, ఎంపీహెచ్ఈఓ ఎస్‌వీబీ శంకర్, ఆశాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మళ్లదొడ్డి–1లో బీసీ–ఈ, గంగంపాలెం–1లో ఓసీ జనరల్, జగన్నాథపురంలో బీసీ–ఎ, బావాజీపేటలో ఓసీ జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 13 నాటికి కోరుకొండ సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఈ తప్పు... భావితరాలకు పెను ముప్పు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం



అనపర్తిలో చెత్తకుప్పపై ప్లాస్టిక్ వ్యర్థాలు

అనపర్తి: ఉదయం లేచింది మొదలు పాలు, టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సామాన్లు.. ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరుబయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికి డ్రైనేజీలు, పంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం–2011 ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారుచేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలిథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసి పోవాలంటే వందలు, వేల ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీ బ్యాగ్‌లకు జనపనార, క్లాత్, కాగితంతో తయారు చేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.



అనపర్తిలో కాలువలో తేలియాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతి వినియోగం పర్యావరణానికే కాదు, మానవాళి ఆరోగ్యానికీ హానికరమే. ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తే కాలుష్యాన్ని అధిగమించగలం. దీనిపై ప్రజలు చైతన్య వంతులు కావాలి.

– డాక్టర్ తాడి రామగురెడ్డి, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం, అనపర్తి

సహజ గుణాన్ని కోల్పోతున్న భూమి



పర్యావరణ కాలుష్యంతో భూమి నానాటికి సహజ గుణాన్ని కోల్పోతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకెళితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించొచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి.

– ఎం.దుర్గాప్రసాద్, సామాజిక కార్యకర్త, అనపర్తి

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రంగంపేట సామాజిక తనిఖీ ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాంగోపాల్

రంగంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు(డ్వామా పీడీ) జీఎస్ రాంగోపాల్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగంపేట మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల వివరాలను, ఖర్చులను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1619 పనులకు గాను రూ.10,36,10,698 వేతన ఖర్చు అయ్యిందన్నారు. మెటీరియల్ నిమిత్తం రూ.41,07,208 ఖర్చు చేశారన్నారు. పలు పనుల కొలతల్లో తేడా వచ్చినందుకు ఆయా సిబ్బందిపై రూ.8,000లు జరిమానా విధించి సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు సంబంధించి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, పీఆర్ ఏఈ సీహెచ్ రాము, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనూష కోరారు. స్థానిక సచివాలయం–2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు, గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలో స్థానిక సబ్ సెంటర్ వద్ద నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.నాగ శ్రీవిద్య పాల్గొని పలువురు రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం జ్యోతి, హెచ్‌వీ బి.శ్రీదేవి, ఎంపీహెచ్ఎస్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మధురపూడి/ సీతానగరం: అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరుకొండ సీడీపీఓ జె.జాన్సీరాణీ తెలిపారు. ఆమె మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కోరుకొండ మండలం గాడాల–1, 5, మధురపూడి–1; పశ్చిమగానుగూడెం–2 కేంద్రాలకు, సీతానగరం మండలం కాటవరం–1, చినకొండేపేడి–1, రామచంద్రపురం–1 కేంద్రాలకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులయిన వారు మాత్రమే అర్హులన్నారు. 01-07-23 తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు లోపు వయస్సున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థినులు వివాహిత అయి ఉండాలని, వీఆర్వో, లేదా పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని జత పర్చాలన్నారు. దరఖాస్తుదారులకు సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థినులు దరఖాస్తులను కోరుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందించి, రశీదులు తీసుకోవాలన్నారు. వివరాలకు సీడీపీఓ కార్యాలయం 0883 2496613 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసే విధంగా ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రాజానగరం మండలంలో 2 అంగన్‌వాడీ కార్యకర్తలు (రాజానగరం–1 బీసీ–బి, పాలచర్ల–2 ఎస్టీ), 2 అంగన్‌వాడీ సహాయకులు (లాలాచెరువు–3 జనరల్, చక్రద్వారబంధం –1 ఎస్సీ), రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 2 అంగన్‌వాడీ సహాయకులు (పిడింగొయ్యి –3 ఓసీ, ధవళేశ్వరం –5 బీసీఏ) పోస్టులు ఖాళీలున్నాయి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

హెల్పర్ పోస్టుకు..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు బిక్కవోలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్థానికంగా నివాసముంటూ పదో తరగతి చదువుకున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



నందరాడలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జక్కంపూడి గణేష్

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజారంజకమైన పరిపాలనను సీఎం జగన్ అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన వైద్యానికి చర్యలు తీసుకుంటా

గ్రామంలో గట్టిం నాగలక్ష్మి తన మూడు సంవత్సరాలు కుమార్తె సిద్విత జెనెటిక్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని, ఆమెకు బోన్‌మారో ఆపరేషన్ చేయించాలని వైద్యులు చెప్పిన సంగతిని తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే చూపు మందగించి ఇబ్బంది పడుతున్న 60 సంవత్సరాల నీల వీరయమ్మకు అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని వెంట ఉన్న వైద్య సిబ్బందికి సూచించారు. అనేక సమస్యలను సత్వరమే పరిష్కరించడంపై జక్కంపూడి రాజా వద్ద గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమకు కావలసింది ఇటువంటి పాలకులేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందరాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: మండలంలోని నందరాడలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అంటూ ఆరా తీశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పందుళ్లమ్మ జాతర



పందుళ్లమ్మను దర్శించుకున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పాటిమీద పందుళ్లమ్మ వారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని దర్శించుకుని నియోజకవర్గంలోని ప్రజలను కాచి కాపాడాలని కోరారు. శ్రీరంగపట్నం, కోరుకొండ, గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామాల పొలాల్లోని అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. మూడు గ్రామాల రైతులు ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.

కోరుకొండ గ్రామదేవత శ్రీ అంకాలమ్మవారి జాతర హోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గరగ నృత్యం, తీన్‌మార్, బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఊరేగింపులోని నవదుర్గ అమ్మవారల బొమ్మలకు భక్తులు పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, సూరిశెట్టి అప్పలస్వామి పాల్గొన్నారు.

హత్యాఘటనపై ఖండన

మధురపూడి: కోరుకొండలో ఇటీవల ముప్పిడిశెట్టి శ్రీనును హత్య చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ ఖండించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక వ్యాపారి, వివాద రహితుడైన శ్రీనును హత్యచేయడం దారుణమన్నారు. దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సెగభగలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రోహిణీ తీవ్రతకు ఖాళీ అవుతున్న రహదారులు
- ఎండల ధాటికి అల్లాడిపోతున్న జనం



దివాన్‌చెరువు నుంచి రాజానగరం వైపు జాతీయ రహదారి ఇలా నిర్మానుష్యంగా..



రాజానగరంలో జాతీయ రహదారి పక్కన చెట్టు నీడన విశ్రమిస్తున్న సంచార జీవులు

రాజానగరం: ఈ ఏడాది మునుపెన్నడూ లేని రీతిలో ఎండల తీవ్రత జనాన్ని అతలాకుతలం చేస్తున్న తరుణంలో రోహిణీ కార్తె ప్రభావంతో రహదారులు ఖాళీ అయిపోతున్నాయి. సాధారణ ఎండలనే భరించలేక తల్లడిల్లిపోతున్న జనాన్ని ఈ రోహిణీ కార్తె మరింత భయభ్రాంతులను చేస్తోంది. రోహిణీ కార్తెలో రోళ్లు కూడా పగులుతాయనే మాట ఏమేరకు నిజమోగాని బయటకు వస్తుంటే తమ మాడు పగిలిపోతుందా అన్నట్టుగా ఎండల తీవ్రత ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జనం హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తున్న వారు వడగాడ్పులకు లోనై, రెండుమూడు రోజులకుగాని మామూలు స్థితికి చేరుకోలేకపోతున్నారు. దీనితో మధ్యాహ్న సమయంలో గ్రామీణ రోడ్లపైనే కాకుండా జాతీయ రహదార్లపై సైతం వాహనాల రాకపోకలు కనిపించలేదు. ప్రతిరోజు సాయంత్రం వరకు రమారమి ఇదే పరిస్థితి నెలకొంటుంది. సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత గాని జన సంచారం, వాహనాల రాకపోకలు ఈ రహదారిపై కనిపించడం లేదంటే వేసవి ఉష్ణోగ్రత తీవ్రతతో ప్రజలు, ప్రయాణికులు ఏ విధంగా భయపడిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్రతాపం చూపుతున్న సూరీడు

రోహిణీ కార్తె ప్రభావంతో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నుంచి 44 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ సైతం ప్రజలను అప్రమత్తులను చేస్తూ ఫోన్ సందేశాలు పంపిస్తోంది. నైరుతి రుతు పవనాల రాక కూడా మరో వారం రోజులు ఆలస్యమవుతుందని, ప్రజలు ఉష్ణోగ్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగరాదని, వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మజ్జిగ, కొబ్బరి నీళ్లతోపాటు రోజుకు వీలైనన్ని ఎక్కువగా మంచినీళ్లు తాగాలని సూచిస్తూ ఫోన్ సందేశాలు వస్తున్నాయి.

బడుగు జీవులకు చెట్ల నీడే శరణ్యం

పొట్ట కూటి కోసం గ్రామాల్లో తిరుగుతూ సంచార జీవనం సాగించే బడుగు జీవులకు ఎండల తీవ్రత ఏవిధంగా ఉన్న జీవన పోరాటం తప్పదు. బడాబాబుల్లా ఎండలు మండిపోతున్నాయని ఏసీ రూముల్లో రెస్టు తీసుకునే అవకాశాలు లేని ఈ దీనులకు ప్రకృతి ప్రసాదించిన చెట్ల నీడే శరణ్యం. ఎండలు ఎక్కువగా ఉన్నాయని ఎక్కడికి పోయేది సారూ, మా బతుకులకు ఈ చెట్ల నీడ అన్నింటికీ దిక్కవుతోందంటున్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

బిక్కవోలు: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు మంగళవారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన షేక్ గౌసియాకు కొంతమూరు గ్రామానికి చెందిన షేక్ షాకీర్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కట్నంగా రూ.85 వేలు, అరకాసు బంగారం ఇచ్చారు. అయితే తన భర్త రోజూ తాగొచ్చి కొడుతూ, అదనపు కట్నం కావాలని వేధిస్తున్నాడని గౌసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కేసు నమోదు

సీతానగరం: మోటారు సైకిల్‌తో సుంకర సాయిరామ్ అనే వ్యక్తి తన భర్త బోకారి సూర్య నారాయణ (65)ను ఢీకొట్టడంతో మరణించాడని మృతుని భార్య రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. మండలంలోని రఘుదేవపురం రవీంద్రకాలనీకి చెందిన బోకారి సూర్యనారాయణ కూలి డబ్బుల కోసం వెళుతుండగా పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి మోటారు సైకిల్ ఢీకొనడంతో మరణించాడని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

542 మందికి వైద్యసేవలు



సీతానగరంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: స్థానికంగా మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 542 మందికి వైద్య సేవలు అందించామని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. ఇంటి వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు డాక్టర్ నేరుగా వెళ్లి వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్‌లను సందర్శించి, అక్కడ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాధాకృష్ణ, ఏఎన్ఎంలు మున్నీసా బేగం, సలీమా, ఆశావర్కర్లు సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు

విద్యాకానుక కిట్లు సకాలంలో చేరాలి



రంగంపేట హైస్కూల్లో జేవీకే కిట్లను పరిశీలిస్తున్న సీఎంఓ శ్రీనివాసరావు

రంగంపేట: మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు సకాలంలో చేరేలా సంబంధిత సిబ్బంది కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ యు.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంచిన విద్యా కానుక సామగ్రిని ఆయన మంగళవారం పరిశీలించారు. రోజు వారీగా పంపిణీ చేస్తున్న పాఠశాలల వివరాలను, జేవీకే కిట్ల జాబితాను సరిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ అందించిన పాఠశాలలతో పాటు మిగిలిన పాఠశాలలకు కూడా త్వరగా కిట్లు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.శ్రీనివాసరావు, సీఆర్పీలు, పీటీఈలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ఆలయంలో కొలువుతీర్చే మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరులో తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన నిధులు, దాతల సహకారంతో పునఃనిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులచే వేదపండితులు, రుత్విక్‌లు పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుతీర్చే మూలవిరాట్‌కు, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ధ్వజస్తంభానికి ఎమ్మెల్యే దంపతులు పంచామృతాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ



సీతానగరంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాస్ట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ కన్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన విభాగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. డ్రాయింగ్ మాస్టర్ ఇజ్జిన రాజ్‌కుమార్, లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనపర్తి ఎంపీడీఓగా హిమ మహేశ్వరి



హిమా మహేశ్వరిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: అనపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా కె.హిమ మహేశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దాపురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన ఆమె ఎంపీడీఓగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో అనపర్తి ఎంపీడీఓగా పని చేసిన పి.వీణాదేవి డీఎల్‌డీఓగా పదోన్నతిపై గతేడాది ఆగస్టు నెలలో రాజమహేంద్రవరం బదిలీ కావడంతో అప్పటి నుంచి ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ బీఎల్ నరసింహం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన హిమ మహేశ్వరిని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ వీర్రాఘవరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.